# మోక్షం సిద్ధి

భుజంగరావు ముఖం దింపి శ్రీహరికేసి చూసేడు. ఇద్దరూ మహాకర్మచారులే. కాని వాళ్లిద్దరి మధ్యా ఎంత తేడా! పని మిగిల్చి ఇంటికి వెళ్లితే తోచదు తనికి. అందువేళ ఆలస్యంగా ఇంటికి వెళ్లడం పరిపాటి అయిపోయింది. శ్రీహరి పది కొడుతూంటేగాని రాడు. అయిదున్నర తరవాత ఉండడు. తన బట్టలు ఎప్పుడూ నలిగినట్టే ఉంటాయి. ఎంత ఓపికతో గీసినా, గడ్డం నిన్న గీసినట్టే ఉంటుంది. పై అధికార్లు ఎన్నిసార్లు తనని సుమారిస్తే అనుకోలేదు! శ్రీహరి ఇంటికి వెళుతున్నప్పుడు కూడా అతని బట్టలు అప్పుడే చాకలి తెచ్చి పెట్టినట్టుంటాయి. మరో అయిదేళ్లు తక్కువ మనిషిలా కనపడే అతని ముఖంమీద ఎప్పుడూ జిడ్డు కనపడదు. తనితాన్నిగురించి! వాళ్ల వృత్తులాలే వేరేమో. తనకి పెళ్లిఅయి మూడేళ్లయింది. శ్రీహరి ఇంకా పెళ్లి చేసుకోలేదు; చేసుకునే సూచనలేమీ లేవుకూడా. రెండేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నా, శ్రీహరి వ్యక్తిగత జీవితంగురించి తనకేమీ తెలియదన్న సంగతి స్ఫురించింది భుజంగానికి.

శ్రీహరి అంటున్నాడు: "నాలుగువందల జీతానికి ఇంత చాకిరీ చెయ్యకూడదు, సార్. అర్ధరాత్రివరకూ ఆఫీసులోనే కూర్చుంటే ఇంక జీవితంలో అనుభవించే దేముంది? అసలు మీ ఆవిడ గొడవపెట్టకుండా ఎలా ఊరుకుంటున్నారో నా కర్థంకాదు."

"మరి, మీరు సరిగ్గా వేళపట్టున వచ్చి వెళుతున్నారు కదా, పెళ్లిచేసుకుని పెళ్లాంతో హాయిగా గడపవలసిన వయస్సుని ఇలా వృథాచేస్తున్నారేం?" ఎదురుప్రశ్న వేసేడు భుజంగం.


"నాకు నచ్చిన జీవితవిధానంలో పెళ్లానికి చోటు లేదేమో. అయినా నాకు పెళ్లెందుకండీ. అవసరాలకి ఈ రాజధాని మహానగరంలో కావలసినవన్నీ సదుపాయా ఉన్నాయి."

"అంటే? జీతమంతా సానివాళ్లకి పెట్టడమా?"

"అంత భోగంవాళ్లవరకూ ఎందుకండీ. హోటళ్లు సదుపాయాలున్నాయి. మామూలు ఇళ్లలో గృహిణులే ఉన్నారు. పెళ్లి చేసుకున్నట్టే ఉంటుంది అక్కడ ఉన్నంతసేపూ."

"రామ! రామ! ఇంకొకడి పెళ్లాన్ని పాడు చెయ్యడమా?"

"నేను పాడుచేసేదేముందండీ. వాడి జీతం చాలడం లేదో, లేక ఆమెను తృప్తిపరచలేకపోతున్నాడో అదికే వృత్తి ప్రారంభించింది. నాలాంటివాళ్లకి సదుపాయంగా



"మరి, ఆ మొగుడు చూస్తూ ఊరుకుంటున్నాడా?"

"మరి, అమాయకులండీ మీరు! ఆ మొగుడికి ఈ సంగతి అసలు తెలుసునో, తెలియదో. వాళ్ళ పక్కఇంటి మనిషి ఇక్కడ 'గులాబ్‌చంద్'లో సేల్స్‌మన్. వాడితో ముందురోజు చెబితే చాలు. మరునాడు రెండు గంటలకి ఆవిడ పబ్లిక్ గార్డెన్‌కి వస్తుంది. జంటగా జల్సాగా ఎక్కడో ఫలహారంచెయ్యడం, వాళ్ళింటికి వెళ్ళడం, మన పని పూర్తిచేసుకుని నాలుగున్నర లోపల బయటపడడం. బస్! వచ్చేసేటప్పుడు బల్లమీద రెండు వందలు పెట్టేసి వచ్చేస్తే చాలు."

భుజంగం ఆశ్చర్యానికి అంతులేదు. ఇటువంటి వ్యవహారాలుంటాయని అతను కలలోకూడా అనుకోలేదు. ఎంత దారుణం! ఇది ఆ మొగుడుకి తెలియకుండా జరిగితే ఎంత ద్రోహం! తెలిసి జరిగితే ఎంత ఘోరం!

'గులాబ్‌చంద్!' — చటుక్కున జ్ఞాపకంవచ్చింది. తన పక్కఇంటి పంజాబీ సుజాన్‌సింగ్ అక్కడేగా పని చేస్తున్నాడు. ఈ తతంగం అంతా అతనికి తెలిసే ఉంటుంది. అడిగి తెలుసుకోవాలి.

అంతలోనే మరో ఊహ మెరిసింది భుజంగం మెదడులో. కొంపతీసి సుజాన్‌సింగే కాదుకదా ఆ సేల్స్‌మన్? పక్కఇల్లంటే తనది! . . .

బల్లమీదనించి చెయ్యి తీసి భుజంగం చెయ్యి పట్టుకున్నాడు శ్రీహరి. "ఒంట్లో బాగులేదేమిటండీ? ఉన్నట్టుండి అలా పాలిపోయిందేమిటి ముఖం?"

ఆలోచించకుండా అబద్ధం చెప్పేడు భుజంగం:

మేఘం నీడకు, అనుమానపు మగడి మనసుకు నిలకడ, నిశ్చలత ఉండవు. కదలనట్లే కనిపిస్తూ కదలిపోయే మేఘంనీడ, చేసుకున్న స్త్రీ సన్నిధిలో నిదానించినా, అనుక్షణం అనుమానించే మగవాడి మనసు వంటిది. పైకి గుంభనగా కనిపించే సంసార స్త్రీ. చాటుమాటున, వెనుకుబాటున కాలుజారుతుంటే, ఆ గాలి సోకి ఇరుగుపొరుగులవారి గుండెలు అవిసిపోవడంలో ఆశ్చర్యం లేదు.

"నాలుగైదు రోజులుగా అప్పుడప్పుడు మైకంలా కమ్ముతూంది."

"ఎక్కువ చాకిరీ చేస్తే ఫలితం ఇదే. కొంచెం విశ్రాంతి తీసుకోండి ఎందుకేనా మంచిది. వైద్యుణ్ణి కూడా చూడండి ఓసారి."

ఎక్కడలేని నీరసమూ ముంచుకువచ్చింది భుజంగానికి. మనస్సులో అనేక విధాలుగా ఊహలు పరిగెడుతున్నాయి. ఎలాగో తెప్పరిల్లి మెల్లిగా శ్రీహరితో బస్సుస్టాండ్‌వరకూ నడిచాడు. రెండు నిమిషాలు అవీ ఇవీ మాట్లాడాక అడిగాడు: "ఇందాకా చెప్పారే, ఎక్కడండీ ఆ ఇల్లు?"

"చిక్కడపల్లిలో. బస్సుస్టాండ్ పక్కవీధిలో మూడో ఇల్లో, నాలుగో ఇల్లో."

గుండె ఆగిపోయినంత పనయింది భుజంగానికి. మూడో ఇల్లు తనదీ, నాలుగో ఇల్లు సుజాన్‌సింగ్‌దీ. అనుమానం నిజమయింది!

భయపడుతూ రెండో ప్రశ్న వేసేడు: "ఏ ఊరు మనిషి ఆవిడ?"

"ముఖం చూడగానే ఫలానా ఊరి మనిషి అని కనిపించే లక్షణం కాదు. మొదట్లో తెలుగు ఆవిడే అనుకున్నాను. కాని ఎప్పుడూ తడుముకుంటూ హిందీలోనే మాట్లాడుతుంది. హిందీమనిషిమాత్రం కాదు." శ్రీహరి ఆగి భుజంగం కళ్ళలోకి చూసేడు. "మీక్కూడా ఏమైనా అవసరా లున్నాయేమిటండీ? అంత మోహమాటం ఎందుకూ అడగడానికి?"

"అబ్బే, అదేం లేదండీ." మాట అనేసరికే భుజంగం ముఖం కందిపోయింది. తనని శ్రీహరి మరో విధంగా అర్థంచేసుకుని అసలు సంగతి అనుమానించలేదు కదా అని అనుమానంకూడా కలిగింది. "అటువంటి అవసరాలు కలిగితే పరిష్కారమార్గం తెలిసిందిగా" అని హాస్యమాడేసి శ్రీహరిని బస్సెక్కించి సాగనంపాడు.

తనేం చెయ్యాలో తోచలేదు భుజంగానికి. అంతా అయోమయంగా ఉంది. శాంత ఇటువంటి అఘాయిత్యానికి ఒడిగట్టుకుంటుందంటే అతని మనస్సుకి నమ్మకం కుదరటంలేదు. స్మృతిపథంలో ఒకసారి తిరగేసి పరిశీలించేడు. లేదు. శాంత ఎప్పుడూ అనుమానాస్పదంగా నడుచుకోలేదు. అసలు దీనికి కారణం ఏమిటి? తను తృప్తిపరచలేక పోతున్నాడా? లేదే. శాంతే ఎప్పుడూ ఇష్టంలేని మనిషిలా, ఏదో అప్పుడు పనిలా ప్రవర్తిస్తుంది. లేక అది తన పాపపు పనులవల్ల కలిగే అధైర్యమా?

## గుళ్ళపల్లి సుబ్రహ్మణ్యం

ఆ డబ్బు? ఏంచేస్తూంది? ఇంటి నిర్వాకంలోగాని బట్టలలోగాని తన జీతాన్ని మించిన ఖర్చు కనపడదే! మరి ఆ డబ్బంతా దాచుకుంటుందా, లేక ఎక్కడికైనా పంపిస్తూందా? ఎక్కడికి పంపినా అనుమానం కలగకుండా ఉంటుందా? ఒకవేళ తను లంచాలు పుచ్చుకుని శాంతద్వారా దాచడానికి పంపిస్తున్నాడని వాళ్ళు అనుకుంటే? ఎంత సిగ్గు! ఇంతటి ఆందోళనలోనూ తనమీద లంచగొండితనం ఆరోపింపబడుతుందేమో నన్న ఊహ కలిగేసరికి వణికిపోయేడు భుజంగం.

ఇప్పుడు తనేం చెయ్యాలి? శాంతని పుట్టింటికి పంపించేస్తే? అలాచేస్తే అసలు సమస్య ఎలా పరిష్కారమవుతుంది? ముందు ఇందులోని నిజానిజాలు తెలుసుకోవాలి. కాని ఎలా?

ఆలోచిస్తూ ఇల్లుచేరాడు భుజంగం. గుమ్మం దగ్గరే నుంచుని ఉంది శాంత. "ఆలస్యమయిందేమండీ" అని పలకరించి ఆ చిరునవ్వు ఇంకా చెదిరిపోకుండానే కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళింది. ముఖంలో ఎక్కడా కల్మషం లేదు. ఇది నటనే అయితే శాంత ప్రథమశ్రేణి నటి. నాటకాలలో రాణించగలదు. "నాటకాలలో వేషం వేస్తావా శాంతా" అన్నాడు కాఫీ తెచ్చిన భార్యను చూసి.

"ఛీ ఛీ. ఆలస్యమయిందేమని అడిగితే ఆ సంగతి చెప్పక ఇదేం మాటలండీ!" అంది శాంత.

మాట మార్చేడు భుజంగం: "తమాషాకి అన్నానులే. కాని ఇవాళ ఎప్పుడూ చెప్పే కారణం కాదు. మా శ్రీహరి ఇవాళ అపురూపంగా ఆఫీసులో ఓ గంటసేపు ఎక్కువ కూర్చున్నాడు. అతనితో టీ తాగి వచ్చేసరికి ఆలస్యమయిపోయింది."

"ఆయన గురించి తరచూ చెబుతూంటారు కదా, ఇంటికి పిలుచుకు రాకపోయారా?"

శ్రీహరిని ఇంటికి పిలుచుకువస్తే — ఇంకేమైనా ఉందా? ఆ ఆలోచనకే నిశ్చేష్టుడైపోయాడు భుజంగం.

* * *

రోజులు గడిచినకొద్దీ భుజంగంలో ఆందోళన, బాధ ఎక్కువవుతున్నాయి. ఎప్పుడూ ఆలోచనలో మునిగిపోయి ఉంటున్నాడు. శాంత కూడా అతనిలోని మార్పును గుర్తించక పోలేదు కాని అతన్ని నిలవేసి అడగడానికి వీలులేనంత అస్పష్టంగా ఉంది ఆ మార్పు.


రోజూ శాంత స్నానంచేస్తున్నప్పుడు వంటింట్లో డబ్బాలన్నీ ఒక్కొక్కటే కాగితంమీద గుమ్మరించి పరీక్ష చేసేడు భుజంగం. కాని డబ్బేమీ దొరకలేదు. ఒక రోజు శాంత గుడికి వెళ్ళినప్పుడు ఆమె పెట్టె కూడా తీసి వెతికేడు.

బట్టలు, తా పెరిగిన నగలు తప్ప పెట్టెలో ఏమీ లేవు. పెట్టె అడుగున రుమాలులో చుట్టి ఉన్న రాళ్ళ దండ కనిపించింది. దానిని చూడగానే ఆ దండ కొన్న సంఘటన అతని స్మృతిపథంలో మెరిసింది.

పెళ్ళి అయిన ఏడాదిలో పనిమీద వరంగల్లు వెళుతూ శాంతనుకూడాతీసుకువెళ్ళేడు. తిరిగివస్తూంటే


వాయిదాలమీద ట్రాన్సిస్టర్

వెలనతి రు. 10/—ల వాయిదాల మీద జపాన్ మోడల్ అతిం ప్రసంచ 3 బాండ్ల ట్రాన్సిస్టర్ పొందండి.



PRINCE TRADERS, (WAP)
Post Box 1406, DELHI-6.

ఏజంట్లు కావలెను

శ్రేష్ఠమైన కాస్మెటిక్స్, పౌంటెన్‌పెన్‌లు, గడియారపు పట్టాలు (నిత్యావసరపు 100 రకముల) అమ్మకమునకు కమిషనుమీద లేక నెలకు రు. 175/— నుండి రు. 350/—ల జీతంమీద కొంతకాలము, లేక పూర్తికాలము పనిచేయు ఏజంట్లు కావలెను. ఉచిత శాంపిలుకు, నిబంధనలకు వ్రాయండి.

VENUS' SALES CORPN. (INDIA),
Kutub Road, (WAP), Delhi-6.

బస్సు దారిలో పడ్డిపోయింది. ఏదో చిన్న గ్రామం. మిగతా ప్రయాణీకులతో తనుకూడా దిగి పచారు చేస్తున్నాడు. ఆ పక్కనే రాళ్లదండలూ, జూంకాలూ, గాజులూ పేర్చి పెట్టుకు అమ్ముతున్న ఓ లంబాడీ పడుచు కనిపించింది. రంగు రంగుల పరికిణీ, ఓణీ లేకుండా బొమ్మలు, కళ నిండిన ముఖం, కట్టుకున్న అంగి సొష్టవం చూస్తూ అలా నుంచుండిపోయాడు. ఎప్పుడు దిగివచ్చిందో శాంత, "ఏమిటండీ మరీను, అలా నోరు వెళ్లబెట్టుకు చూస్తున్నారు?" అంది. ముందుకు వెళ్లి ఆ అమ్మి సామగ్రి పరీక్షచెయ్యడం ప్రారంభించింది.

బస్సు మరమ్మత్తయిపోయి ప్రయాణీకులకోసం హారన్ కొడుతున్నాడు డ్రైవర్. "పద ఇంక, పోదాం" అని బస్సుకేసి నడిచాడు తను. "ఓ రెండు రూపాయలిలా ఇవ్వండి" అని కేకవేసింది శాంత. వెనక్కి వచ్చేడు. రాళ్లదండ ఒకటి చేతొపట్టుకు చూపిస్తోంది శాంత. "ఇవన్నీ పట్టి డబ్బు దండుగ" అన్నాడు తను. "ఏవండీ, ప్లీజ్. . ." అని చిలిపిగా చెయ్యిచాపి నుంచుంది. కాదనలేక డబ్బుతీసి ఇచ్చి శాంతచెయ్యి పట్టుకు బస్సు దగ్గిరికి పరిగెత్తేడు.

బస్సులో దండని పరీక్షచేస్తూ అంది శాంత "ఈ దండ నేనెప్పుడు వేసుకున్నా మీకు ఆ అమ్మే జ్ఞాపకం వస్తుంది" అని. అందుచేతనేమో ఆ దండ ఎప్పుడూ వేసుకోవేలేదు!

వారం రోజులు గడిచాయి. ఆ వేళ మనోవేదన భరించలేక ఆఫీసునుంచి నౌబత్ పహాడ్‌మీదికి పోయి కూర్చున్నాడు భుజంగం. హాయిగా గాలి వీస్తున్నా అతని హృదయాగ్ని మాత్రం చల్లారడం లేదు. ఎంత ఆలోచించినా తన సమస్యకి పరిష్కారం కనబడటం లేదు. కిందికి దిగి నడక ప్రారంభించేడు. అబిడ్ వీధికి వచ్చేసరికి హఠాత్తుగా శ్రీహరి కనిపించేడు.

"బజారుకి వచ్చేరా? చేతిలో సామానేం లేదే!"

"ఊరికే అలా వచ్చేను. మీరు?"

"నేనూ అంతే. 'గులాబ్‌చంద్'కి వెళ్లి —"

ఫడేలుమని లెంపకాయ కొట్టినట్టనిపించింది భుజంగానికి.

"ఏం— " అని ఈడ్చాడు.

"ఆఁ. అవసరాలు. రేపటికి — "

రేపు! రేపే?

మతిపోతూంది భుజంగానికి. ఇంటికి వెళ్ళేసరికి అతని స్థితిచూసి శాంత గాభరా పడింది. "ఏమండీ, ఒంట్లో బాగులేదా?" అని నుదుటిమీద చెయ్యివేసి చూసింది.

"అదేమీలేదు. కొంచెం చిరాకుగా ఉంది" అని తప్పించుకున్నాడు.

రాత్రి ఎంతసేపటికీ నిద్ర పట్టలేదు. అలా ఆలోచిస్తూ ఉండిపోయాడు. రేపు ఇటో అటో తేలిపోవాలి.

మరునాడు మామూలుగానే ఆఫీసుకివెళ్లిన భుజంగం ఒకటిన్నరకి ఇంటికి తిరిగి వచ్చేసేడు. తలుపు తీసిన శాంత మడతచీర కట్టుకుని ముస్తాబై ఉంది!

"ఏమండీ, ఇలా వచ్చేసేరు? ఒంటో బాగులేదా ఏమిటి?" అని ఆదుర్దాగా ప్రశ్నించింది తొయ్యబారి నిలబడిపోయిన భర్తని చూసి.

"ఆఁ. నిన్న అన్నావుగా, ఇవాళ నిజంగానే అయింది" అన్నాడు భుజంగం నీరసంగా. "ఎక్కడికీ ప్రయాణం?"

"మరేమీ లేదు. ఆ మూడో ఇంటి చౌదరి ఆవిడ లేదూ, కొత్తరకం ఎంబ్రాయిడరీ చెబుతానంది. చాలా రోజులుగా వెళ్లాలనుకుంటున్నాను. ఇవాళగాని పడింది కాదు."

తటపటాయించలేదు. తడుముకోలేదు. ఇటువంటి అవసరానికే ఆలోచించి పెట్టుకుందా?

నిస్పృహతో అన్నాడు: "తయారైనదానివి మానెయ్యడం దేనికి? నాకిప్పుడు కావలసిందేమీలేదు. నేను విశ్రాంతి తీసుకుంటాను, నువ్వు వెళ్లిరా."

మొదట నిరాకరించినా చివరికి సమ్మతించి బయలుదేరింది శాంత. వెన్నంటడానికి ధైర్యం చాలలేదు భుజంగానికి. అలాగే నిర్లిప్తంగా మంచం మీద కూలబడ్డాడు.

పది నిమిషాలలో తిరిగి వచ్చేసింది శాంత, "ఆవిడ ఇవాళ బజారుకి వెళుతూందిట" అంటూ. మాట వరసగా అంది, "ఆవిడ, పంజాబీ బట్టలు ఎంత బాగున్నాయండీ. నాకు కూడా కుట్టించి పెడతానంది కావలిస్తే. కాని మనవాళ్లంతా నవ్వుతారని భయంగా ఉంది."

ఏమీ పాలుపోలేదు భుజంగానికి. 'ఇదేం చిక్కుప్రశ్న' ఆలోచిస్తూ ఉండిపోయాడు. భర్త ఏమీ జవాబు చెప్పకపోయేసరికి శాంత చిన్నపుచ్చుకుని లోపలికి వెళ్లిపోయింది. చటుక్కున తెప్పరిల్లాడు భుజంగం. అనుకోకుండా అనేసేడు, "లంబాడీ బట్టలుకూడా ఇప్పుడు ఫాషనేమో. ఇందాకా వస్తుంటే ఓ లంబాడీ ముఠా కనిపించింది. రాజధాని చూడడానికి వచ్చినట్టున్నారు. నాకు నువ్వు కొన్న దండ జ్ఞాపకం వచ్చింది. ఏం చేసేవు దాన్ని?"

శాంత కళ్లలో ఈర్ష్య మెరిసింది. "ఉంది లెండి. మీ కసలు ఆ దండ జ్ఞాపకం వచ్చిందా? ఆ అమ్మి జ్ఞాపకం వచ్చిందా?" అంది.

'అమ్మయ్య' అనుకున్నాడు భుజంగం.

సాయంత్రం నాలుగయింది. పాలబుడ్డి పట్టుకు బైలుదేరింది శాంత. "నేను తెస్తానుండు. ఇంట్లో కూర్చుంటే ఏమి తోచటంలేదు" అని బుడ్డి పట్టుకు బయలుదేరేడు భుజంగం. డిపోలో పాలు పుచ్చుకు బయటపడడానికి అరగంట పట్టింది. తిరిగివస్తూ వీధి మలుపు తిరిగే సరికి — ఎదురుగుండా శ్రీహరి!

"ఆఫీసులో ఉండాల్సిన వేళ ఇక్కడున్నారేమండీ!" అని పలకరించి చేతిలో పాలబుడ్డి చూసి "అయితే మీరి దగ్గర్లోనే ఉన్నారన్నమాట" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఆఁ. మీ రిక్కడ ఈవేళప్పుడు — "

"నిన్న చెప్పాగా."

భుజంగం ముఖం నల్లబడిపోయింది. గుండెల దడలో చెవులు సరిగ్గా వినపడటం లేదు. శ్రీహరి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. "అంతా అయిపోయిందా!"

"ఆహా."

భుజంగానికి బోధపడలేదు. శ్రీహరి కళ్లల్లోకి చూస్తూ అడిగేడు. "మధ్యాహ్నంనించి ఈ పనిమీదే ఉన్నారా?"



"చెప్పేనుగా! టూ టు ఫోర్ థర్టీ."

ఒక్క పెట్టున విప్పారింది భుజంగం ముఖం. "ఎక్కడ ఆ ఇల్లు?"

"ఈ వీధే. ఆ — అయిదో ఇల్లు." కళ్లతో లెక్క పెట్టి చెప్పేడు శ్రీహరి.

ఆధారం ఏదీ లేకుండా గాలిలోకి తేలిపోయినట్టనిపించింది భుజంగానికి. "చౌదరి ఇల్లా?" మధ్యాహ్నం శాంత అన్న మాటలు జ్ఞాపకం వచ్చేయి.

"వాడెవడో నాకేం తెలుసు? — అయితే మీరు కూడా ఈ ప్రాంతంలోనే ఉన్నారన్నమాట."

"ఈ మూడో ఇల్లేనండీ." వేలుపెట్టి చూపించేడు భుజంగం. "పదండి. మా ఇంటికి రాకుండా వెళ్లడానికి వీలులేదు" అని శ్రీహరి చెయ్యి పట్టుకులాగి ముందుకి నడిచేడు, అతను నిరాకరించడానికి అవకాశం ఇవ్వకుండా.

విప్పారిన ముఖంతో పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ఆపుకోలేని నవ్వుతో లోపలికి వచ్చిన భర్తని చూసి నిర్ఘాంతపోయింది శాంత. తేరుకునేలోగా శ్రీహరి వచ్చి చేరాడు.

"ఈయనే నేను తరచు చెబుతూ ఉండే శ్రీహరి" అని పరిచయం చేసేడు భుజంగం. "కూర్చోండి" అని అతనిని కుర్చీలోకి తోసి రెండోదాంట్లో తను చతికిలబడి కాలుమీద కాలువేసి పాదం జోరుగా ఆడిస్తూ "రెండు కప్పులు కాఫీ తెచ్చిపెట్టు, శాంతా" అన్నాడు.

మళ్లీ ఆగి శ్రీహరికేసి ఓరచూపుచూసి లోపలికి వెళ్లిపోయిన భార్య వెనక "మూడు కప్పులు పట్టుకురా. ఈయనకి రెండు కప్పులు కావాలిట — అలిసిపోయి ఉన్నారు" అని కేకవేసేడు! ★